క్లుప్తంగా

తప్పులు లేని జాబితా తయారు చేయండి



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న అనురాధ

కౌతాళం: ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలని మంత్రాలయం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాధ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్‌కు ఎన్‌రోల్‌మెంట్ తప్పని సరిగా రావాలన్నారు. ఫారం 8, 10, 11, 15, మరియు 16ఫారంలు అంటే ఏమిటి వాటిని ఎలా చేయాలని అన్న విషయాలపై పూర్తిగా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. సాయంత్రం పరీక్ష పెట్టి సర్టిఫికెట్లను అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన, అర్హత ఉన్నవారి పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. అలాగే మరణించిన వారి పేర్లను తొలగించాలని, వలస వెళ్లిన వారిని గుర్తించాలన్నారు.

సారా తయారు చేస్తే జైలు శిక్ష



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నాటుసారా తయారు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని కర్నూలు ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కర్నూలు సీఐ జయరాంనాయుడు, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్రప్రసాద్, ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్ అన్నారు. బుధవారం మండలంలోని ఆఫీసరాళ్ల కొండలు, సింగరాజుమల కొండలు, తాయమ్మ బయలు కొండల్లో ఎక్సైజ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో 1,050 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 47 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు చెప్పారు. ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ రఘు, బోయ మద్దిలేటి, బోయ శివ, బోయ మునిలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదోనికి చేరుకున్న ఎల్లెల్సీ నీరు



పూజలు చేస్తున్న ఎల్లెల్సీ అధికారులు

ఆదోని సెంట్రల్/ఆదోని టౌన్/కౌతాళం: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం నుంచి (ఎల్లెల్సీ) దిగువ కాలువకు విడుదల చేసిన నీరు మండల పరిధిలోని హానవాళు గ్రామానికి బుధవారం చేరుకున్నాయి. సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం ఈనెల 10వ తేదీన నీటిని విడుదల చేయగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన హొళగుంద మండలం చింతకుంట గ్రామం 130 కిలో మీటరు వద్దకు 14వ తేదీన చేరుకున్నాయి. బుధవారం ఆదోని పరిధిలోని 250 కిలో మీటరు వద్దకు చేరుకోవడంతో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్, తాగునీటి సంఘం అధ్యక్షులు రామస్వామి, గురిలింగ, పంపన్నగౌడ్, డీఈ షఫివుల్లా, ఏఈ ఈశ్వర్, మేనేజర్ మాదవ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ సుపరింటెండెంట్ లక్ష్మీ, సుశీలమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సులోచనమ్మ ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం బందేనవాజ్, ఉపాధ్యాయులు నాగరాజు, రంగస్వామి, ప్రేమ జ్యోతి, సంజీవ రాయుడులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

ఆదోని అర్బన్: పట్టణంలోని లక్ష్మమ్మవ్వ కాలనీలోని 8 మందిపై విద్యుత్‌శాఖ ఏఈ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగరాజుతో పాటు మరో ఎనిమిది మంది కరెంట్ బిల్లు కట్టకపోవడంతో బుధవారం విద్యుత్ సిబ్బంది కనెక్షన్ తొలగించారు. దీంతో వారు ఎస్కేడీ కాలనీలో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయంలో గొడవ చేశారు. వెంటనే విద్యుత్‌శాఖ ఏఈ లోకేష్ నాగరాజుతో పాటు మరో 8 మందిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుళాయిలు అరకొర.. తాగునీటికి కటకట

- గోనెగండ్ల హైస్కూల్‌లో 1750 మంది విద్యార్థులకు 15 కుళాయిలు
- సగానికి పైగా పనిచేయని వైనం
- ప్లేట్లు పట్టుకొని బయటకు వెళ్తున్న విద్యార్థులు
- నీటి ట్యాంకులను ఆశ్రయించాల్సిన పరిస్థితి



పాఠశాల బయట ఉన్న మంచినీటి ట్యాంకు వద్ద నీటి కోసం విద్యార్థులు



పాఠశాలలో కొళాయిల దగ్గర గుమికూడిన విద్యార్థులు

గోనెగండ్ల : కూటి కోసం కోటితిప్పలు అన్నట్లుగా గుక్కెడు నీటి కోసం విద్యార్థులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. మండల కేంద్రం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. ఆ విద్యార్థులకు తాగునీటి సమస్య రోజురోజుకు పెరిగిపోతుంది. పాఠశాలలో కొన్నే మంచినీటి కుళాయిలు ఉన్నాయి.. అందులోనూ సగం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు తాగునీటి కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది.

మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు..

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,750 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులకు తాగునీటి కోసమని 15 కుళాయిలు ఏర్పాటు చేశారు. అందులో ఎనిమిది మరమ్మతులకు గురికాగా.. ఏడు మాత్రమే పని చేస్తున్నాయి. వాటి ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో ఉన్న కుళాయిలకు అందరూ ఒకేసారి గుమికూడుతున్నారు. విద్యార్థులకు సరిపడ తాగునీటి కుళాయిలు లేకపోవడంతో భోజనం చేసిన అనంతరం బాలురు దాహం తీర్చుకునేందుకు ప్లేట్లు పట్టుకొని పాఠశాల బయట ఉన్న నీటి ట్యాంకును ఆశ్రయిస్తున్నారు. అక్కడే ప్లేట్లు శుభ్రం చేసుకొని పాఠశాలలోకి వెళ్తున్నారు.

నీటి కోసం రోడ్డు దాటి..

పలువురు పాఠశాల విద్యార్థులు మెయిన్‌రోడ్డు దాటి అవతలికి వెళ్లి ట్యాంకు వద్ద నీళ్లు తాగుతున్నారు. ఈ దారిలో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. విద్యార్థులకు ఏదైన ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో మరిన్ని మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తే విద్యార్థులు పాఠశాల బయటకు రావాల్సిన అవసరం ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

మరిన్ని కుళాయిలు ఏర్పాటు చేస్తాం

పాఠశాలలో విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించాం. కుళాయిల ద్వారా నీరు సరఫరా అవుతుంది. కుళాయిలు సరిపోకపోతే మరిన్ని ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.
– నాగభూషణం, హెచ్‌ఎం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఇన్‌చార్జ్ బుట్టా రేణుకను సత్కరించిన మైనారిటీ విభాగం పట్టణ అధ్యక్షుడు రసూల్

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక సూచించారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా నియామకమైన ముల్లా రసూల్, అల్తాఫ్‌లు బుధవారం ఆమెను కలిసి శాలువాతో సత్కరించారు. తమకు పదవులిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, యూత్ నాయకుడు హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

కౌతాళం: మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ప్రహల్లదచారి తెలిపారు. సమావేశం సాయంత్రం ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్‌లో జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

కౌతాళం: మండలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం వేరే ప్రాంతలకు వెళ్లేటప్పుడు, పొలాలకు వెళ్లినప్పుడు ఇంటి దగ్గర ఎవరో ఒకరు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసి తాళం చెవులను ఇంటి దగ్గర వదలి వెళ్లకూడదన్నారు. గ్రామాలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనాలు జరుగుతున్నాయని విలువైన బంగారం, వెండి వస్తువులను, డబ్బులను బ్యాంకుల్లో ఉంచుకోవాలని సూచించారు. అవసరానికి మించి ఎక్కువ డబ్బులు ఇంటిలో పెట్టుకోరాదన్నారు. గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు కనిపిస్తే వివరాలు అడిగి తెలుసుకుని ఫొటోలు తీసుకోవాలన్నారు. అనుమానం వస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని కోరారు.

సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఇళ్ల స్థలాలకై ఇచ్చిన దరకాస్తులను సచివాలయాల్లో ఆన్‌లైన్ చేయని సిబ్బందిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ చెప్పారని, కానీ సచివాలయ సిబ్బంది మాత్రం ఆన్‌లైన్ చేయకుండా తిప్పుకుంటున్నారని చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి బుధవారం ఆదోని ఎస్‌ఎంహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని తిని రుచి చూశారు. పక్కనే ఉన్న విద్యార్థినీ, విద్యార్థులను భోజనం, సాంబారు రుచికరంగా ఉన్నాయా లేదానని అడిగి తెలుసుకున్నారు. కోడి గుడ్డు ఇచ్చారా లేదానని అడిగారు. గత నెలలో ఎస్‌ఎంహెచ్ పాఠశాలలో భోజనం అధ్వానంగా ఉండేదని, విద్యార్థుల ఫిర్యాదు మేరకు డీఈఓ, మున్సిపల్ కమిషనర్‌తో పాటు తాను తనిఖీ చేశామన్నారు. ప్రస్తుతం భోజనం రుచికరంగా ఉందన్నారు. పాఠశాలలో ఓ విద్యార్థిని వాటర్ బాటిల్ తీసుకుని నీళ్లు తాగారు. అనంతరం విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులు తీసుకురావాలని, ఆదోనికి ఆదర్శంగా నిలపాలని సూచించారు. పాఠశాలలో గదుల కొరత, విద్యుత్ సమస్య, తాగునీటి సమస్య, వాటర్ స్కీంకు త్రీ ఫేస్ విద్యుత్ మంజూరు చేయించాలని ఉపాధ్యాయులు,విద్యార్థులు చైర్‌పర్సన్‌ను కోరారు. చాలీచాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 11 గదులు మరమ్మతుల్లో ఉన్నాయని, వాటికి టాపు వేసి విద్యార్థులకు కేటాయించాలని చైర్‌పర్సన్‌ను విద్యార్థులు కోరారు.

కూరగాయల మార్కెట్ పరిశీలన

ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగరాజుతో పాటు మరికొందరు పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, ఎంఎం రోడ్డులోని చైనాపక్ల డాక్టర్ ప్రాంతంలోని మసీదు ఏరియా, పరష ముల్లా, మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్, నిజాముద్దీన్ కాలనీ, మాసామసీదు ఏరియా ప్రాంతాల్లో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్‌పై ఆరా తీశారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంలో జాప్యం జరుగుతోందని స్థానికులు కొంత మంది ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని చైర్‌పర్సన్ స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరించుకోండి



ర్యాలీలో పాల్గొన్న రెండో అదనపు జడ్జి పి.జె.సుధ, సీనియర్ జడ్జి, జూనియర్ జడ్జి, న్యాయవాదులు

ఆదోని అర్బన్: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. బుధవారం మీడియేషన్ ఫర్ ది నేషన్ అనే కార్యక్రమంలో భాగంగా జిల్లా జడ్జి కం చైర్మన్ మండల లీగల్ సర్వీస్ అథారిటీ పి.జె.సుధ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి రోషన్ లాడ్జి, భీమా సర్కిల్ మీదుగా ర్యాలీ చేపట్టారు. జడ్జి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి కక్షిదారులు, బాధితులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. మధ్యవర్తులైన న్యాయవాదులు, పెద్దల సమక్షంలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, జూనియర్ జడ్జి శ్రీవల్లి, డీఎస్పీ హేమలత, లాయర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



మాధవరంలో ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మంత్రాలయం రూరల్ : మండలంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మాధవరంలో ఎరువుల దుకాణాలపై ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నారాయణ, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ జీరా గణేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పాండురంగ ట్రేడర్స్, మాధవరంలో ఎరువుల దుకాణంలో రూ.8,92,000 విలువ గల 33 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 6 రకాల ఎరువులు , 3 రకాల పురుగు మందుల నమూనాలు పరిశోధన కేంద్రానికి పంపించామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



ఓ ఇంట్లో పరిశుభ్రతను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్

నందవరం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘురామిరెడ్డి, జిల్లా ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వీలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించి, బాలింతలు, శిశువు ఆరోగ్యంపై సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో వారం రోజుల పాటు మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామంలో మలేరియా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా మురుగు కాలువలు, పరిసరాలలో అబేట్ మందు పిచికారీ చేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బలరాముడు, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తగిన మోతాదులో యూరియా వాడాలి

కోసిగి: వేరుశనగ, పత్తి పంటల పైర్లకు మూడు సార్లు మాత్రమే యూరియాను చల్లుకోవాలని, లేక పోతే భూమి సారం తగ్గిపోయి పంట దిగుబడి తగ్గుతుందని ఏఓ వర ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో 25 మెట్రిక్ టన్నుల యూరియాను బుధవారం రైతులకు పంపిణీ చేపట్టారు. మండలంలోని చిన్నభూంపల్లి, పెద్ద భూంపల్లి, ఆర్లబండ, అగసనూరు, కోసిగి, సజ్జలగుడ్డం, డి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనం వేసేటప్పుడు, నెల రోజులకొకసారి, 60 రోజులలో ఒక సారి పైర్లకు యూరియా చల్లుకోవాలని సూచించారు. తద్వారా నత్రజని, భాస్వరం, పోటాష్ ఎరువుల సమతుల్యత పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు.

అందుబాటులో యూరియా



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

ఆదోని రూరల్: ఆదోని మండలానికి బుధవారం యూరియా స్టాకు వచ్చింది. సాక్షి దినపత్రికలో బుధవారం 'పడిగాపులు కాస్తూ.... కన్నీళ్లతో తిరిగెళ్తూ' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన జిల్లా అధికారులు యూరియాను ఆదోని మండలానికి పంపించారు. బుధవారం వచ్చిన యూరియా బస్తాలను మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రైతు సేవా కేంద్రాలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ 327 మంది రైతులకు యూరియా పర్మిట్లు రాసి 1,330 బస్తాలను కేడీసీఎంఎస్ ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని పెద్దహరివాణం, ధణాపురం, చిన్నపెండేకల్ రైతుసేవా కేంద్రాల్లో కూడా యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు పొందవచ్చన్నారు. గురువారం 3001 మెట్రిక్ టన్నుల క్రిప్కో యూరియా, 441 బీపీఎల్ యూరియా రానున్నట్లు తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో కూడా యూరియా ఎమ్మార్పీకే అందుబాటులో ఉందన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే తమదృష్టికి తీసుకురావాలన్నారు.

యూరియా అందక అన్నదాతల ఆందోళన

- నందవరం సొసైటీకి 5 లారీల లోడ్ వచ్చినా పంపిణీ చేయకపోవడంపై నిలదీత
- వచ్చిన స్టాకు టీడీపీ నాయకులు ఎగరేసుకుపోతున్నారని ఆగ్రహం



నందవరం సొసైటీలో యూరియా లోడ్ దింపుతున్న దృశ్యం



నందవరంలో వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈఓతో వాగ్వాదం చేస్తున్న రైతులు

నందవరం : ఓ వైపు వానలు లేక సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టాకష్టాలు పడుతుంటే..మరో వైపు ఎరువులు దొరక్క అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నందవరంలో వ్యవసాయ, వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ఎదుట బుధవారం రైతులు యూరియా అందక ఆందోళన చేశారు. మిట్టసోమపురం, మాచాపురం, హాలహర్వి గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈఓతో వాగ్వాదానికి దిగారు. సొసైటీకి 5 లారీల లోడ్ వచ్చినా రైతులకు ఎందుకు పంపిణీ చేయడం లేదని ఎంపీఈఓను నిలదీశారు. మూడు రోజుల నుంచి యూరియా కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగితున్న అధికారులు స్పందిచడం లేదని, వచ్చిన లోడ్లన్నీ టీడీపీ నాయకులే దండుకుపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి సామాన్య రైతులకు యూరియా అందించాలని వేడుకుంటున్నారు.

యూరియాపై టీడీపీ నాయకుల పెత్తనం..


మండలంలో రైతు సేవ కేంద్రాలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాల వచ్చిన యూరియా టీడీపీ నాయకుల పెత్తనం సాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎరువులు కొరత లేకుండా ఆర్బీకేల ద్వారా నేరుగా రైతులకే అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. రైతు సేవ కేంద్రాలలో యూరియా కనిపించడం లేదు. అరకొరగా స్టాక్ వచ్చినా టీడీపీ నాయకుల కనుసన్నలలోనే యూరియా పంపిణీ సాగుతోంది.

యూరియా దొరకడం లేదు



రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఎరువుల మందులు చల్లుకోవడానికి యూరియా కోసం వెళ్లితే ఈ రోజు, రేపు అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. గత మూడు రోజులుగా వ్యవసాయ పనులు మానుకొని నందవరం సొసైటీ చుట్టూ ప్రదక్షిణలు చేసినా యూరియా దొరకడం లేదు. బుధవారం యూరియా స్టాక్ వచ్చినా పంపిణీచేయడం లేదు. ఇలాగైతే మేము పంటలు పండించిట్లే. ప్రభుత్వం ప్రతి రైతు ఎరువులు అందిస్తే బాగుంటుంది. – యూ. హనుమంతమ్మ, మిట్టసోమపురం, మహిళ రైతు

టీడీపీ నాయకులే దోచుకెళ్తున్నారు



యూరియా వచ్చిన స్టాక్ అంతా టీడీపీ నాయకులే దొచుకెళ్తున్నారు. మాలాంటి సామాన్య రైతు పరిస్థితి ఎమిటో అర్థం కావడం లేదు. 5 రోజుల నుంచి యూరియా కోసం వ్యవసాయ సహకార సొసైటీ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ అధికారులను అడిగినా స్పందించడం లేదు. గతంలో వచ్చిన స్టాక్ అంతా టీడీపీ నాయకులే పంచుకున్నారు. మా గ్రామానికి యూరియానే అందలేదు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి మాకు యూరియా పంపిణీ చేస్తే బాగుటుంది. –రామలింగదు, రైతు, మిట్టసోమపురం

పంటల వైవిధ్యంతో భూసారం పెంపు



రైతులకు విత్తన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఎమ్మిగనూరురూరల్: పంటల వైవిధ్యత నేలలో సారం పెంచేందుకు దోహదపడుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర, మారుటేరు పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తేజశ్వరరావు, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతులపై మారుటేరు పరిశోధన విభాగం వారు ఎంపిక చేసిన రైతులకు 'పంట, పద్ధతుల మార్పు'లో భాగంగా సోయాబిన్ రకం కెడీఎస్ 726 , ఏబీవీ04 అనే రకం సజ్జ విత్తనాలు అందజేశారు. వారు మాట్లాడుతూ నూనె గింజ పంటైన సోయా బీన్స్ వేసుకుంటే నేల సారం పెరగటంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కెడీఎస్726 అనే రకం పంట కాలం 90–95 రోజులు కాగా దిగుబడి ఎకరాకు 10 క్వింటాళ్ల వస్తుందని చెప్పారు.

కుంగిన కల్వర్టు



మదిర ముఖద్వారంలో వద్ద కల్వర్టు దుస్థితి

కౌతాళం: మండల పరిధిలోని మదిర గ్రామ ముఖద్వారం వద్దనే కల్వర్టు కుంగి పోవడంతో ప్రమాదంగా తయారయ్యింది. వాహనాలకు ప్రమాదం బారిన పడకుండా గ్రామస్తులే చుట్టూ రాళ్లు పెర్చి సూచిక ఏర్పాటు చేశారు. సుళేకేరి నుంచి మదిర, పొదలకుంట గ్రామాల మీదుగా హాల్వి వరకు 7కిలోమీటర్ల రోడ్డులో ఇలాంటి దృశ్యాలు చాలనే కనిపిస్తాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదని ప్రయాణికులు ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏ సమయంలోనైన కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే దెబ్బతిన్న కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జూన్ నెల ముగిసినప్పటికీ డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం ఘోరమన్నారు. చాలా రాష్ట్రాల్లో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చేపట్టకపోవడం విడ్డూరంగా వుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ తాలుకా నాయకులు ఇమ్రాన్, మహమ్మద్, రామ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలో అన్యాయం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన కార్తీక్ నాయుడు, గంగాధర్, దేవరాజు, చంద్రశేఖర్, ఈశ్వర్, రామాంజినేయులు అనే విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు కర్నూలులోని డీఎస్ఏ కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రమిచ్చి నరసన తెలిపారు. వారు మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్‌లో ఆ విద్యార్థులు మెరిట్ సాధించినా జిల్లా స్పోర్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజకీయ ప్రోద్బలానికి తలొగ్గి సీటు రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేసి తమ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
సత్వార న్యాయం కోర్టుల ధ్యేయం
సమాజ శాంతిని కాపాడే,
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు
అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
సి. గిరిధర్, అడ్వకేట్, ఆదోని, సెల్ : 94402 44138

అంతర్జాతీయ న్యాయదినోత్సవ శుభాకాంక్షలు
ధర్మాన్ని రక్షించి, అధర్మాన్ని శిక్షించి, సమాజ శాంతికి దోహదపడుతున్న న్యాయమూర్తులకు & న్యాయవాదులందరికీ అంతర్జాతీయ న్యాయదినోత్సవ శుభాకాంక్షలు.
రోషద్ M.A., M.S.W, LL.B. న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మిగనూరు. సెల్: 94945 08294